
సాక్షి నంద్యాల

సోమవారం । 1 । జూలై । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై ఆదివారం కాకినాడకు చెందిన వాగ్దేవి నృత్య నికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఆదివారం భ్రామరీ సమేత మల్లికార్జున స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేపట్టారు.



మహానందిలో సండే సందడి

మహానంది: ఆదివారం సెలవురోజు కావడంతో వేలాది మంది భక్తులు మహానందికి తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

అన్నదాన పథకానికి రూ. 11 లక్షల విరాళం



రూ.10 లక్షల విరాళాన్ని అందించిన దాత సత్య ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఏఈఓ స్వాములు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన కాశీభట్ల సత్య ప్రసాద్ రూ.10,00,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ స్వాములుకు అందజేశారు. అలాగే హైదరాబాదుకు చెందిన బి. శ్రీకాంత్ రెడ్డి రూ. లక్ష విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి. హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామి వారి శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో సోమవారం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,21,240 మందికి రూ.150.23 కోట్లు మంజూరయ్యాయన్నారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.7వేలు చొప్పున పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. పంపిణీలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వేలిముద్రలు పడని వారికి ఐరీస్ ద్వారా పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేందుకు ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పీఆర్ ఎస్ఈగా రామ్మోహన్

కర్నూలు(అర్బన్): నంద్యాల పీఆర్‌ఐ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎం రామ్మోహన్‌కు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంజినీరు ఇన్ చీఫ్ బీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ రెగ్యులర్ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం ఆదివారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రామ్మోహన్‌కు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఆదోని పీఆర్‌ఐ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఏ వెంకటప్రసాద్ కూడా పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కర్నూలు పీఆర్‌ఐ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఈసీ మద్దన్నకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు.

బయో మోసం

వ్యవసాయ సీజన్ ఆరంభమైతే చాలు నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులను మోసం చేసేందుకు కొందరు వ్యాపారుల అవతారమెత్తుతున్నారు. అడ్డదారుల్లో సంపాదన కోసం రైతులను నట్టేట ముంచుతున్నారు. నంద్యాల, కర్నూలును కేంద్రంగా చేసుకుని కొందరు దళారులకు పెద్ద ఎత్తున కమీషన్లతో పాటు నజరానాల ఆశచూపి నకిలీ బయో వ్యాపార దందా కొనసాగిస్తున్నారు. మొన్నటి వరకు జోరుగా కొనసాగిన నకిలీ మిరప, పత్తి విత్తనాలకు అడ్డుకట్ట పడగా.. ప్రస్తుతం నకిలీ జీవ ఎరువులు, మందుల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. వీటిని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది.



రైతులకు నేరుగా లారీల్లో నుంచే జీవ ఎరువులను సరఫరా చేస్తున్న దృశ్యం



జీవనియంత్రణ మందు డబ్బా

- నాసిరకం బయో ఎరువులు, మందులతో వ్యాపారుల దందా
- జిల్లాలో యథేచ్ఛగా రైతులకు అంటగడుతున్న అక్రమార్కులు
- ఉద్యాన పంటల సాగుదారులే లక్ష్యంగా విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: మొట్ట వాణిజ్య పంటలు అధికంగా పండించే నంద్యాల జిల్లాలో కొందరు వ్యాపారులు 'బయో'త్పాతం సృష్టిస్తున్నారు. పర్యావరణానికి, నాణ్యమైన వ్యవసాయం దిగుబడికి మేలు కలిగిస్తాయనే పేరుతో రసాయన ఎరువులు, పురుగుమందుల స్థానంలో బయో ఉత్పత్తుల పేరుతో రైతులను దగా చేస్తున్నారు. పైరు ఆరోగ్యంగా పెరుగుతుందని, దిగుబడులు నాణ్యతతో పాటు అధికంగా ఉంటుందని దళారులు రైతులకు నాసిరకం బయో ఉత్పత్తులను అంటగడుతున్నారు. ముఖ్యంగా పత్తి, మిరప, పుసుపు, అరటి, బొప్పాయి, నిమ్మ, వరి పంటలను సాగుచేసే రైతులను లక్ష్యంగా బయో మందుల వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతోంది. ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వీటిని కొందరు విక్రయిస్తుంటే.. మరి కొందరు ఎటువంటి అనుమతులు లేని కంపెనీల నుంచి నేరుగా గ్రామాల్లోకి తెచ్చి ఏజెంట్ల ద్వారా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మారుమూల గ్రామాలను లక్ష్యంగా చేసుకుని నకిలీ బయో మందుల అమ్మకందారులు చెలరేగి పోతున్నారు. నంద్యాల కేంద్రంగా చేసుకుని గుంటూరు, హైదరాబాద్ ప్రాంతం నుంచి నేరుగా లారీల్లో తెచ్చి వీటిని విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో నేరుగా వీటిని విక్రయించడంతో పాటు వాస్తవ ధరలకంటే నాలుగు అయిదు రెట్లు అధిక మొత్తంలో వీటిని అంటగడుతూ రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఊరూ, పేరు తెలియని వ్యక్తులు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా సేంద్రియ, జీవ ఎరువులు, మందుల పేరుతో వీటిని విక్రయిస్తున్నారు. రూ. కోట్లలో వ్యాపారం జరుగుతున్నా వీరికి లైసెన్స్ ఉందా లేదా అనేవి ఎవరూ పట్టించుకోవడం లేదు. నాణ్యత లేని, తక్కువ రకం రసాయనాలతో నకిలీ మందులను తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. పై ముడత, కింది ముడత, తెగుళ్లు, కీటకాలు, వైరస్ తదితర వాటిని పూర్తిగా నివారిస్తాయని చెబుతూ మోసం చేస్తున్నారు. చివరకు వైరస్‌లు సోకి పైరు పూర్తిగా దెబ్బతిన్న సంఘటనలు ఉన్నాయి.

పత్తా లేని అధికారులు

జిల్లాలో నకిలీ బయో మందుల వ్యాపారం భారీగా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారుల దందాలో రైతులు ఏటా మోసపోతున్నా అధికారులకు పట్టడం లేదు. దిగుబడులు తగ్గిపోతే ఎవర్ని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్, గుంటూరు, కడప, మహబూబ్‌నగర్, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల బ్రాండ్లతో ఎరువులు, పురుగు మందుల వ్యాపారం జోరుగా కొనసాగిస్తున్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేస్తే వారికి కొంతైనా భద్రత ఉంటుంది. బిల్లులు కూడా ఉంటే సంబంధిత కంపెనీలపై ఫిర్యాదు చేసే అవకాశ కూడా ఉంటుంది. మండల స్థాయిలో వ్యవసాయ శాఖాధికారులు ఇలాంటి వాటిపై సరైన నిఘా ఉంచక పోవడంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బహుమతుల పేరుతో దగా..

మామూలుగా ఒక్కో బస్తా రూ. 600 లెక్కన విక్రయిస్తున్న వ్యాపారులు, ఏజెంట్లు అత్యధిక అమ్మకమే ధ్యేయంగా నజరానాలు ప్రకటించి విక్రయిస్తున్నారు. ఒక రైతు ఐదు బస్తాలు కొనుగోలు చేస్తే ఆ రైతుకు లీటరు హ్యూమిక్ యాసిడ్ (చారెడు యూరియాతో తయారు చేసిన నీళ్లు), 10 బస్తాలు కొనుగోలు చేస్తే రెండు లీటర్లు ఇలా బహుమతులు అందజేసి రైతులను ఆకర్షిస్తున్నారు. ఈ మందు వృక్ష సంబంధిత పదార్థాల మిశ్రమమని, ఈ మందు చల్లడం వల్ల పైరు బాగా ఏపుగా పెరగడంతో పాటు తెగుళ్లను, కీటకాల నుంచి తట్టుకుని పూత, పిందె, అధికంగా వచ్చి పంట దిగుబడి రెట్టింపు వస్తుందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ యూరియా ద్రావణం సొంతంగా తయారు చేసుకుంటే రూ. 10 కూడా ఖర్చు కాదని కొందరు చెబుతున్నారు.

రూ. 50 వేల సరుకు అమ్మేది 2.50 లక్షలకు

ఈ వ్యాపారంలో లాభాలు దండిగా వస్తుండటంతో అక్రమార్కుల దందా కొనసాగిస్తున్నారు. ఒక లారీలో సుమారు 500 బస్తాల లోడు వస్తుంది. ఒక బస్తా ఖరీదు సుమారు రూ. 100 వేసుకున్నప్పటికీ మొత్తం లారీ లోడు ఖరీదు రూ. 50 వేల వరకు ఉంటుంది. బస్తాను రూ. 600 లెక్కన విక్రయిస్తే లారీకి రూ 2.50 లక్షల లాభం వస్తుంది. ఇలా జిల్లాలో సుమారు రూ. 100 కోట్లకు పైగా అక్రమార్కులు రైతుల దగ్గర నుంచి దండుకుంటున్నారు. ఇందులో అధికారుల వాటా ఎంతో అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగంగా విక్రయాలు చేస్తున్న ఎరువుల బస్తాలపై తయారీ తేదీ, గడువు ముగిసే తేదీ, లైసెన్స్ నెంబరు, నిర్ణీత ధర తదితర విషయాలు ఏమీ లేకుండానే చెలామణి చేస్తున్నారు. ఇలా రోజుకో పేరుతో ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారు.

అవగాహన అవసరం

అనుమతి ఉన్న బయో మందుల వాడకం వల్ల రైతులకు కలిగే అదనపు ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పించాలి. బయో మందుల ఉత్పత్తుల్లో అనుమతి ఉన్నవాటి జాబితాను రైతులకు అందుబాటులో ఉంచడమో లేక ఆయా షాపుల వద్ద ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేసినట్లయితే కొంతమేర ఈ నకిలీల బెడద నుంచి రైతాంగాన్ని కాపాడవచ్చు. రాష్ట్రస్థాయిలో అనుమతులు మంజూరు చేసే వ్యవస్థలు ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి సమాచారాన్ని చేరవేయడం ద్వారా కూడా సత్ఫలితాలు వచ్చే అవకాశముంటుంది. నకిలీ బయో మందుల విక్రయాలను కట్టడి చేసేందుకు అధికారులు తరచూ తనిఖీ చేయాల్సి ఉంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఏజెంట్లు కొందరు గ్రామాల్లోకి వచ్చి బయో మందుల వ్యాపారం చేస్తున్నారు. తక్కువకు దొరికే ఈ ఎరువులు, మందులు వాడితే తెగుళ్లు రావు, పంట ఏపుగా పెరుగుతుంది, దిగుబడి ఎక్కువ వస్తుంది అని చెబితే నమ్మాల్సి వస్తోంది. ఏవి మంచివో కావో.. మా కేం తెలుసు. తక్కువ ధరకు మంచి మందులు దొరుకుతున్నాయని ఆశ పడటం సహజం. నకిలీ మందులు అమ్మే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. – లింగన్న, రైతు, లింగందిన్నె

అక్రమార్కులపై కఠిన చర్యలు



రైతులకు నేరుగా ఎవరూ ఎరువులు, పురుగుల మందులు విక్రయించకూడదు. రైతులు నకిలీ ఎరువుల కొనుగోలు చేసి మోసపోవద్దు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేసి తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నేరుగా రైతులకు ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తున్నారన్న విషయం తమ దృష్టికి తీసుకువస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ

పోలీసు శాఖలో సేవలు అందించడం అదృష్టం

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల టౌన్: సమాజ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖలో సేవలు అందించడం అదృష్టంగా భావించాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన వన్ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ పుల్లయ్య, సీసీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ యాసీన్, మహానంది సబ్ ఇన్‌స్పెక్టర్ బాలచంద్రుడు, బేతంచర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ కలిముల్లా బేగ్, బేతంచెర్ల శంకర్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వు పోలీస్ ఏఆర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వు హెడ్ కానిస్టేబుల్ చలమయ్య, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌ర్ రిజర్వు హెడ్ కానిస్టేబుల్ దామోదరం, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌ర్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ శివ శంకర్ రెడ్డి, సీసీఎస్ ఏఎస్ఐ ఇస్మాయిల్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా చేరి ఎస్ఐ స్థాయి వరకు చేరుకోవడంలో వారి జీవిత భాగస్వామి సహకారం ఎంతో గొప్పదని అభినందించారు. శేష జీవితాన్ని కుటుంబీకులతో సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ నరసింహులు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, శ్రీనివాసులు, నాగభూషణం, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో రూటు మార్చిన చిరుత

- గోశాల నుంచి మాడ వీధుల్లో సంచారం
- స్పందించని అటవీశాఖ అధికారులు



మహానంది ఆలయం వెనుక మాడవీధుల్లో సంచరిస్తున్న చిరుతపులి

మహానంది: మహానంది గోశాల ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా సంచరిస్తున్న చిరుత పులి తాజాగా రూటు మార్చింది. శనివారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో గోశాల వైపు నుంచి ఆలయం వెనుక ఉన్న మాడవీధుల మీదుగా దేవస్థానం కార్యాలయం వైపు వెళ్లింది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఆ సమయంలో మాడవీధులలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే ఆదివారం సాయంత్రం మహానందిలోని పాత వివేకానంద స్కూల్ ప్రాంగణంలోకి వచ్చింది. కాగా, ఆలయ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తులను ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా స్థానిక ఆలయం ఎదురుగా ఉన్న సుపథ మండపాల్లో నిద్రించడానికి అనుమతించడం లేదు. ఎవరో ఒకరిపై దాడి చేసే వరకు అటవీశాఖ అధికారులు చిరుతను బంధించేలా లేరని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అడవిలోనే మీరున్నారు.. అవి మీరున్న ప్రాంతానికి రాలేదు కదా అనే ధోరణిలో అటవీశాఖ అధికారులు మాట్లాడుతుండటం విస్మయానికి గురిచేస్తోంది. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకుని సుదూర ప్రాంతాలకు తరలించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించండి

- 3వ తేదీలోపు ఇవ్వకపోతే అనర్హత వేటు
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యయ పరిశీలకులు ఎస్. మణికందన్, కిరణ్ తొట్టుపురం అసోకన్, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు టికారాం మీనా, నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను 3వ తేదీలోగా తప్పకుండా సమర్పించాలని సూచించారు. ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు ప్రతి అభ్యర్థి తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలన్నారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపని వారిపై అనర్హత వేటు పడటంతో పాటు తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కోల్పోతారన్నారు. జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 157 మంది అభ్యర్థులు పోటీ చేయగా, వారిలో ఇప్పటివరకు 108 మంది అభ్యర్థులు మాత్రమే తమ ఖర్చుల నివేదికను సమర్పించారన్నారు. బనగానపల్లెలో 11 మంది, శ్రీశైలంలో 8, నందికొట్కూరులో 8, డోన్‌లో ఒకరు, ఆళ్లగడ్డలో ఆరుగురు, నంద్యాలలో నలుగురు, పార్లమెంటు స్థానానికి సంబంధించి 11 మంది అభ్యర్థులు తమ ఖర్చుల నివేదికలను సమర్పించాల్సి ఉందన్నారు. మూడు రోజుల పాటు అకౌంట్స్ రిసెప్షన్ టీం(ఏఆర్టీ) సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అకౌంట్స్ పరిశీలన పూర్తి చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు కూడా జిల్లా కేంద్రంలోని ఉంటారని వీలైనంత వీలైనంత త్వరలో ఖర్చులకు సంబంధించిన బిల్లులు, ఓచర్లు సూచించిన ప్రొఫార్మాలో పొందుపరిచి ఇవ్వాలన్నారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల సహాయ వ్యయ అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

17 వరకు సబ్సిడీ బియ్యం పంపిణీ

నంద్యాల(అర్బన్): పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు జూలై మాసంలో ఎండీయూ వాహనాల ద్వారా కార్డు దారులకు సోమవారం నుంచి 17వ తేదీ వరకు సబ్సిడీ బియ్యం పంపిణీ జరుగుతుందని డీఎస్ఓ వెంకటరాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యంతో పాటు జొన్నలు మాత్రమే పంపిణీ చేయాలని సంబంధిత శాఖ అధికారులు తెలిపారన్నారు. బియ్యం బదులు 3 కేజీలు జొన్నలు ఉచితంగా అందజేయనున్నారన్నారు. అన్ని గోదాములలో లీగల్ మెట్రాలజీ సరుకుల నాణ్యత, పరిమాణం తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వనున్నామన్నారు. కార్డు దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల(వ్యవసాయం): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచడంతో స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘం కార్యాలయం వద్ద దివ్యాంగులు కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి మంత్రి ఫరూక్ హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు సామాజిక పెన్షన్లను పెంచి జూలై 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు చేయడం సంతోషంగా ఉందన్నారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, పురపాలక సంస్థలు, పంచాయతీల నుంచి దివ్యాంగుల అభివృద్ధికి రావాల్సిన 5 శాతం నిధులు కేటాయించి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ సంఘం సమన్వయకర్త రమణయ్య ఆధ్వర్యంలో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న 20 మంది దివ్యాంగులకు మందులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రవికృష్ణ, రామచంద్రారావు, సుబ్బారెడ్డి, నాగరాజు, నాగకుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

టీకా.. ఆరోగ్య రక్ష

- టీకాలతో వ్యాధులు దూరం
- జిల్లాలో గతేడాది 1,35,536 డోసుల టీకాలు
- ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్

గోస్పాడు: అప్పుడే పుట్టిన శిశువుల నుంచి చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య శాఖ ఏటా టీకాస్త్రం ఉపయోగిస్తోంది. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం లక్ష్యం మేరకు అందరికీ టీకాలు ఉచితంగా వేస్తోంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్న జబ్బు చేసినా ప్రజలు ఇబ్బందులు పడేవారు. అవగాహన లేకపోవడంతో వ్యాధి నిరోధక టీకాలు వేసుకునేందుకు చాలా మంది భయపడేవారు. ఆ భయాన్ని వీడేలా అధికారులు అవగాహన కల్పించడంతో వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తవుతోంది. జిల్లా పరిధిలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 16 అర్బన్ హెల్త్ సెంటర్లు, 369 హెల్త్ క్లినిక్‌లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా పరిధిలో గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మే నెల చివరి వరకు 1,35,536 డోసుల వ్యాక్సిన్లు పూర్తి చేశారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి. గర్భిణులు, శిశువులు, చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరవని వైద్యులు చైతన్యం చేస్తున్నారు. జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

టీకాలు వేసేదిలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలల తర్వాత టీటీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ వేస్తారు. వీటి తోపాటు ఐరన్, ఫోలిక్, క్యాల్షియం ట్యాబ్లెట్లు ఇస్తారు. మహిళ ప్రసవానంతరం ఐరన్ ట్యాబెట్లు అందజేస్తారు.
- చిన్నారులకు 9 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోస్ వేయించాలి. దీంతో పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. ఆరు నుంచి 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితోపాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్ల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి, మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు, టీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీని వేయించాలి.
- ఐదేళ్ల పూర్తయిన తర్వాత డీపీటీ డోసు, 10-16 సంవత్సరాలు పూర్తయితే టెటనస్, టెక్సాయిడ్ (టీటీ) వేయించాలి.



గోస్పాడులో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యాధులు వాటి పట్ల ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన వ్యాధి నిరోధక టీకాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలి.

– డాక్టర్ ప్రసన్నలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జ్ ఇమ్యూనైజేషన్ అధికారి, నంద్యాల

వంద శాతం పూర్తికి చర్యలు



గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలుకొని పట్టణ ప్రాంతాల వరకు ఏ ఒక్క శిశువు, చిన్నారిని వదలకుండా గ్రామాల్లో తరచూ వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి టీకాలు వేస్తున్నారు. జిల్లాలో వంద శాతం టీకాలు వేసేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి చేస్తోంది. తాజాగా బీసీజీ టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయి, ఈ టీకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్ఓ, నంద్యాల

క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ వేడుకలో పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: ధార్మిక పర్యటనలో భాగంగా శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు బెంగళూరులో పర్యటించారు. ఆదివారం పీఈఎస్ యూనివర్సిటీలో రామచంద్రపుర మఠం పీఠాధిపతి రాఘవేశ్వర భారతి స్వామిజీ రచించిన భావరామాయణ, రామావతరణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచించిన స్వామిజీని సుబుధేంద్ర తీర్థులు సత్కరించారు. శాస్త్రోక్తంగా ఈ వేడుకను నిర్వహించారు.

నేటి నుంచి సంగీత కళాశాల తరగతులు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల తరగతులు సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునిప్రసాద్ తెలిపారు. 2024–25 సంవత్సరానికి కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. గాత్రం, వయొలిన్, నాదస్వరం, మృదంగం, కూచిపూడి నృత్య విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూలై 1వ తేదీ 2024 నాటికి 10 సంవత్సరాల వయసు ఉండాలని పేర్కొన్నారు. కళాశాలలో నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు, రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం తరగతులు ఉంటాయని తెలిపారు. ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: ఆదోని–ఇస్వీ రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్వేట్రాక్ పై నాగర్‌కోయిల్ (రైలు నంబర్ 16339) రైలు కింద పడి ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. మృతుని కుడి భుజంపై త్రిశూలం పచ్చబొట్టు, చేతికి బి.రాజు అనే అక్షరాలు ఉన్నాయని, నీలం కలర్ ఫుల్ డ్రాయర్, గ్రే కలర్ అడ్డు పంచ, చినిగిన చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. రెండు కాళ్లకు నల్లని దారాలు ఉన్నాయని, దగ్గరలోనే పాత హీరో సైకిల్ ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9849157634 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని సూచించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగిన 104 ఉద్యోగుల సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రస్తుతం 104 సంస్థను అరవిందో సంస్థ నిర్వహిస్తోందని, దానిని ప్రభుత్వం నడపాలన్నారు. ఉద్యోగులకు సమయానికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేయాలని కోరారు. అనంతరం ఖాళీగా ఉన్న 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్థానంలో వెంకటేశ్, ఉపాధ్యక్షుల స్థానాల్లో కల్యాణి, వెంకటేశ్‌లను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దయ్య, నాయకుడు చంద్రహాస్ పాల్గొన్నారు.

వైద్యుడా.. వందనం!

- వైద్యులపై ప్రజలకు పెరిగిన నమ్మకం
- కర్నూలు పెద్దాసుపత్రిలో సూపర్ స్పెషలిస్టు వైద్యులు
- ప్రైవేట్‌లోనూ పెరిగిన అత్యాధునిక వైద్య సేవలు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యం ఎంత వాణిజ్యత సంతరించుకున్నా ఇప్పటికీ వైద్యుడంటే ఓ నమ్మకం. వారి వద్దకు వెళితే తమకు వచ్చిన ఆరోగ్య సమస్య తగ్గుతుందని భరోసా. ఈ మేరకు వ్యయప్రయాసలకు ఓర్చి డాక్టర్ల వద్దకు వచ్చేవారు చాలా మంది ఉన్నారు. అపాయింట్‌మెంట్ కోసం ఎన్ని గంటలైనా వేచి చూస్తున్నారు. సదరు డాక్టర్ మాట్లాడే కొద్ది నిమిషాల్లో వారిపై నమ్మకంతో కుటుంబసభ్యులకు చెప్పని విషయాలు కూడా చెబుతారు. రోగి చెప్పిన విషయాలను అంతే నమ్మకంతో ఇతరులకు చెప్పకుండా దాక్టర్లు వైద్యం చేస్తున్నారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరం డాక్టర్లకు ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్ తర్వాత వైద్యరంగంలో అంతగా వైద్యుల సంఖ్య ఉన్న నగరమిది. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 16 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు, 50కి పైగా అర్బన్‌హెల్త్ సెంటర్లు, 400లకు పైగా విలేజ్ హెల్త్‌క్లినిక్స్ ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులు ఉంటున్నారు. మొత్తం పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్యసేవలందించేవి 40కి పైగా ఉన్నాయి. వీటితో పాటు కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, కోడుమూరు, ఆత్మకూరు వంటి ప్రాంతాల్లో వందలాది మంది వైద్యులు ప్రైవేటు రంగంలో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరిలో కొందరు వారి డిమాండ్‌ను బట్టి ఫీజు వసూలు చేస్తుండగా, మరికొందరు సేవా దృక్పథంతో నామమాత్రపు ఫీజుతో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఒకప్పుడు కర్నూలులో మాత్రమే మెడికల్ కాలేజి ఉండేది. కానీ వైఎస్ఆర్‌తో పాటు ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఐదు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. వీటి నుంచి ప్రతి సంవత్సరం వెయ్యి మంది దాకా నూతన వైద్యులు బయటకు వస్తున్నారు.

కార్పొరేట్ రంగంలో విస్తృతమైన సేవలు

పాతికేళ్ల క్రితం ఎండోక్రైనాలజిస్టు, యురాలజిస్టు, న్యూరోసర్జన్, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు, న్యూరాలజిస్టు, క్యాన్సర్ థెరపిస్టు వంటి స్పెషాలిటీ వైద్యులు ఒక్కొక్కరు మాత్రమే ఉండేవారు. వారి వైద్యసేవల కోసం రాయలసీమతో పాటు తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుంచి సైతం రోగులు చికిత్స కోసం వచ్చేవారు. వైద్యరంగం విస్తృతమయ్యాక ఇప్పుడు ప్రతి సూపర్ స్పెషాలిటీ విభాగంలో వైద్యుల సంఖ్య పాతిక మందికి పైగా ఉన్నారు. ఒకప్పుడు చదువుకోవడానికి ఇతర జిల్లాల నుంచి కర్నూలు వచ్చి ఆ తర్వాత ఇక్కడే స్థిరపడి వైద్యసేవలు అందిస్తూ ఉన్నవారు వందల్లో ఉన్నారు. కర్నూలును నమ్ముకుని వైద్యసేవల ప్రాక్టీస్ ప్రారంభించిన వారే కాకుండా ఇటీవల కార్పొరేట్ సంస్థలు సైతం తమ శాఖలను కర్నూలుకు విస్తరించాయి. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించే అత్యాధునిక వైద్యపరీక్షలు, వైద్యసేవలు కర్నూలులో అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక గుండె, క్యాన్సర్ వైద్యసేవలు సైతం కర్నూలులోనే నిర్వహించడం విశేషం.

పేదల డాక్టర్



కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌లో కొన్ని దశాబ్దాలుగా వైద్యసేవలు అందిస్తున్నారు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ డి. ధనరాజు. కృష్ణానగర్, అబ్బాస్‌నగర్‌లతో పాటు పక్కనే ఉన్న శరీన్‌నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ ప్రాంత ప్రజలకు ఆయన ఎంతో సుపరిచితుడు. ఆయా ప్రాంతాల పేద ప్రజలకు ఇప్పటికీ ఆయన దేవుడు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యవిద్యనభ్యసించడమే గాక అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి హెచ్‌వోడీ దాకా వైద్యసేవలు అందించి పదేళ్ల క్రితం పదవీ విరమణ చెందారు. కొత్తగా వస్తున్న జనరల్ ఫిజీషియన్లు సైతం వారి ఫీజును రూ.200ల నుంచి రూ.300ల దాకా తీసుకుంటూ ఉంటే డాక్టర్ ధనరాజు మాత్రం ఇప్పటికీ రూ.50 మాత్రమే తీసుకుంటూ పేదలకు అండగా ఉంటున్నారు. అత్యవసరమైతే తప్ప ఆయన వైద్యపరీక్షలు చేయించరన్న పేరుంది. మందులు సైతం చాలా తక్కువగా రాసి ప్రజలపై భారం లేకుండా చూస్తారన్న నమ్మకాన్ని ఆయన చూరగొన్నారు.

పెద్దాసుపత్రి అంటే ఓ నమ్మకం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అంటే అందులో పెద్ద పెద్ద డాక్టర్లుంటారని ప్రసిద్ధి. ఇక్కడికి వస్తే ఎలాంటి ఆరోగ్య సమస్య అయినా నయం అవుతుందని ప్రజల్లో ఓ నమ్మకం. ఆ నమ్మకంతోనే వందల కిలోమీటర్లు ప్రయాణించి రావడంతో పాటు వసతులు ఉన్నా లేకపోయినా ఎంతో ఓపికతో ఆసుపత్రిలో ఉండి వైద్యసేవలు అందుకుని వెళ్తున్నవారు వేలల్లో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు వచ్చినా ఇప్పటికీ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ 2,500లకు పైగా ఓపీ రోగులు చికిత్సకు వస్తున్నారు. నిత్యం ఇక్కడ 1200లకు పైగా ఇన్‌పేషంట్లు చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ 30 నుంచి 35 మంది గర్భిణులు ప్రసవం చెందుతున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, వారి సహాయకులు కలిపి నిత్యం పగటి పూట ఈ ఆసుపత్రిలో 10వేల మంది సంచరిస్తున్నారంటే ఈ ఆసుపత్రికి ఉన్న ఆదరణ ఎలాంటిదో చెబుతుంది. ఒకప్పుడు సూపర్‌స్పెషాలిటీ వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు దాదాపుగా అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు ఇక్కడ లభిస్తున్నాయి. అన్ని స్పెషాలిటీ విభాగాల్లో పీజీ సీట్లు రావడంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం వైద్య విద్యార్థులు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు.

ఆ.. సంతృప్తి వెలకట్టలేనిది



2015లో 65 ఏళ్ల వయస్సున్న వృద్ధురాలికి ప్రమాదం జరిగి రెండు కాళ్లు, చేతుల్లోని ఎముకలన్నీ విరిగిపోయాయి. మాంసం ముద్దలా ఉన్న కండిషన్‌లో ఆమెను మా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అలాంటి వ్యక్తికి మత్తుమందు వైద్యుల సహాయంతో గంటల కొద్దీ సమయం వెచ్చించి ఆపరేషన్ చేశాం. ప్రస్తుతం ఆమె ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. తన పనులు తాను చేసుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితం సైతం ఓ వ్యక్తిపై పిల్లర్ పడటంతో కాలు తీసేసే పరిస్థితిలో మా వద్దకు వచ్చారు. అతనికి సైతం ఆపరేషన్ చేసి కాలు తీయాల్సిన అవసరం లేకుండా చికిత్స చేసి పంపించాం. ఇలాంటి రోగులు మా వద్దకు వచ్చి బాగై వెళ్తుంటే మాకు వచ్చే సంతృప్తి వెలకట్టలేనిది.

–డాక్టర్ పి. విజయకృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

బద్దెపురుగు తిత్తులను తొలగించాను



సరిగ్గా ఏడాది క్రితం కడపకు చెందిన ఓ రోగి హృద్రోగ సమస్యతో నా వద్దకు వచ్చారు. అతనికి అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించగా గుండెలో తిత్తులు ఉన్నట్లు గుర్తించాను. ఆపరేషన్ చేయాలని భావించి థియేటర్‌లో గుండె తెరిచి చూడగా బద్దె పురుగులు బయటపడ్డాయి. పదుల సంఖ్యలో బద్దె పురుగులు చేరి తిత్తులుగా మారి గుండెను అతుక్కుని ఉన్నాయి. అతనికి విజయవంతంగా ఆపరేషన్ చేసి వాటిని తొలగించడంతో ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడు. సరిగ్గా ఉడకని మాంసం తినడం, పెంపుడు జంతువుల కారణంగా ఇలాంటి ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. నేను తొమ్మిదిన్నర సంవత్సరాల్లో దాదాపుగా 4,500లకు పైగా గుండె, ఊపిరితిత్తుల ఆపరేషన్లు పూర్తి చేశాను.

–డాక్టర్ పీఎస్ఎస్. లక్ష్మణస్వామి, కార్డియోథొరాసిక్ సర్జన్, కర్నూలు

నా జీవితంలో అరుదైన కేసు



బనగానపల్లెకు చెందిన ఒక మహిళకు పుట్టుకతోనే మూత్ర సంచి బయట ఉండింది. దీని వల్ల ఆమెకు నిరంతరం మూత్రం కారిపోతూనే ఉండేది. ఈ సమస్య వల్ల ఆమె పాఠశాలకు వెళ్లి చదువుకోలేకపోయింది. ఈ సమస్యను 32 ఏళ్ల పాటు భరిస్తూ వచ్చింది. అలాంటి సమయంలో ఆమె పాతికేళ్ల క్రితం నా వద్దకు రావడంతో ఆపరేషన్ చేశాను. ఆమెకు బయట ఉన్న మూత్రసంచి తీసివేసి, పెద్దప్రేగు, చిన్నప్రేగు ద్వారా ప్రత్యేకంగా మూత్రసంచి తయారు చేసి ఉంచాం. ఈ ఆపరేషన్ చేసేందుకు పది గంటల సమయం పట్టింది. దీనివల్ల ఆమెకు అపెండిక్స్ ద్వారా మూత్రం బయటకు వెళ్లడంతో ఆమె సమస్య తొలగిపోయింది. ఇప్పటికీ ఆమె ఎంతో ఆరోగ్యంగా తన పని తాను చేసుకుంటోంది. ఇంత అరుదైన కేసు నా జీవితంలో మరిచిపోలేనిది.

– డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, యురాలజిస్టు, కర్నూలు

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం దంపతులను సన్మానిస్తున్న ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రిటైర్డ్ పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీరు కే సుబ్రమణ్యం అన్నారు. పదవీ విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీ రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళీకృష్ణనాయుడు, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కే నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, ఈఈలు రామకృష్ణారెడ్డి, ఏ వెంకటప్రసాద్, ఎస్ మద్దన్న, రామ్మోహన్, రిటైర్డు ఎస్ఈలు జీ సురేంద్రనాథ్, కేదారీశ్వరరావు, సుబ్బారావు, నాగేంద్ర, పీఏ టు ఎస్ఈ బండారు శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ జేడీ పెంచలప్రసాద్, నంద్యాల డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గౌస్‌పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పీలేరు సమీపంలోని చిన్న పల్లెటూర్లో జన్మించిన ఎస్ఈ సుబ్రమణ్యం కష్టపడి చదివి ఏఈఈ నుంచి ఎస్ఈ వరకు అంచెలంచెలుగా ఎదిగారన్నారు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో సౌమ్యుడుగా ఆయనకు మంచి పేరు ఉందని కొనియాడారు. సుబ్రమణ్యం దంపతులను ఇంజినీర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ సతీష్‌కుమార్, డీఈఈలు హెచ్‌డీ ఈరన్న, మల్లికార్జున, మహేశ్వరరెడ్డి, అమర్‌నాథ్, రిటైర్డు డీఏఓ రవీంద్రుడు, డా.కుళ్లాయప్పలు పాల్గొన్నారు.

సీమ కరువును అక్షరీకరించిన సింగమనేని



మాట్లాడుతున్న హరికిషన్

కర్నూలు కల్చరల్: రాయలసీమలో కరువు పరిస్థితులను ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ తన సాహిత్యంలో కళ్లకు కట్టినట్లు అక్షరీకరించారని ప్రముఖ కథారచయిత డాక్టర్ ఎం. హరికిషన్ అన్నారు. ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సింగమనేని నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ రాయలసీమ వ్యవసాయ సంక్షోభాన్ని, రైతుల కన్నీటిని సింగమనేని నారాయణ తన కథల ద్వారా, ఉపన్యాసాల ద్వారా సాహితీ లోకానికి బలంగా వినిపించారన్నారు. రచయిత రాణి లీలావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు ప్రమోద్ చక్రవర్తి, డాక్టర్ చిన్నావుల రాజారెడ్డి, దాసరి వెంకటరమణ, మీసాల రఘు, జి.ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూ లైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండి పోయాయి. స్వామి వారి సర్వ దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పా హారం, బిస్కెట్స్ దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది కి ప్రత్యేక విధులు కేటాయించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు మల్లన్న కు రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

కర్నూలులో వరుస చోరీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా ఎక్కడో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని వాసవీనగర్‌లో అనంతక్రిష్ణ శర్మ ఇంట్లో చోరీ జరిగింది. తన తండ్రి ఆరోగ్యం బాగాలేక సమీపంలోని అమీలియా ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసేందుకు ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వచ్చారు. రాత్రి ఆసుపత్రిలోనే ఉన్నారు. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లో బీరువాను పరిశీలించగా 12 తులాల బంగారు నగలు దొంగలు ఎత్తు కెళ్లారు. బాధితురాలు అనూష నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

- అక్రమాలకు పాల్పడిన వారిపై విజిలెన్స్ విచారణ
- మండల మీట్‌లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, న్యాయబద్ధంగా పని చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పొదుపు భవనంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పై అధికారులు ఒత్తిడి కారణంగా కింది స్థాయి ఉద్యోగులు కూడా తప్పులు చేయడం జరిగిందన్నారు. ఏ అధికారులు ఎలాంటి తప్పులు చేశారో ఆధారాలతో సహా ఉన్నాయని, వారిపై విజిలెన్స్ దర్యాప్తు తప్పదన్నారు. తప్పులు చేసిన అధికారులు ఏ స్థాయిలో ఉన్న చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయో కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కోరారు. అలాగే సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలన్నారు. ముందుగా వివిధశాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను సభ ద్వారా సభ్యులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి విన్నవించారు. సమావేశంలో తహసీల్దార్ రవీంద్రారెడ్డి, పీఆర్ డీఈఈ నాగ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు ఎం.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, సర్పంచ్ ఈసారి యల్లమ్మ ఇంకా వివిధశాఖలఅధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓగా సూర్యచంద్రరాజు



కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓగా ఎం.సూర్యచంద్రరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓగా విధులు నిర్వహించిన బి. వెంకటేశ్వరరావు పదవీ విరమణ పొందారు. దీంతో డోన్ సబ్ డివిజన్ డీఎఫ్ఓగా విధులు నిర్వహిస్తున్న సూర్య చంద్రరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బోధనోపకరణాలపై నేటి నుంచి శిక్షణ

కర్నూలు సిటీ: బోధనోపకరణాలపై జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నేటి(సోమవారం)నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇందుకోసం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఆదోనిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పత్తికొండ ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల, ఎమ్మిగనూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 492 మంది టీచర్లకు రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. శిక్షణకు గైర్హాజరు అయితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని విద్యాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



శ్రీమఠం ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రాఘవేంద్రుల మూలబృందావన దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రాఘవేంద్ర స్వామి, గ్రామ దేవత మంచాలమ్మ దర్శన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం, తీర్థ ప్రసాద కౌంటర్లు కిటకిటలాడాయి. భక్తుల ఏర్పాట్లను శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు పర్యవేక్షించారు.

యువకుడి ఆత్మహత్య

ఆదోని అర్బన్: మద్యానికి బానిసై పెళ్లి అయిన రెండు నెలలకే బసవరాజు(24) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి సంతెకూడ్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీరప్పకు ముగ్గురు కుమారులు ఉండగా, వారిలో పెద్ద కుమారుడైన బసవరాజుకు రెండు నెలల క్రితం ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన కవిత అనే యువతితో వివాహం జరిగింది. మద్యానికి బానిసైన బసవరాజు శనివారం రాత్రి తన ఇంట్లోనే యథావిధిగా నిద్రించాడు. అయితే తెల్లవారుజామున భార్య కవిత నిద్రలేచే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. బసవరాజు మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్‌ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో కుటుంబ సభ్యులు, భార్య రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

నేడు కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేధావుల వేదిక నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నామని, వేడుకకు హాజరు కావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కర్నూలు జిల్లా మేధావుల వేదిక ప్రెసిడెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.మన్సూర్ రహమాన్ ఆహ్వానించారు. ఆదివారం కర్నూలు జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలసి విన్నవించారు. తొలిసారి 1858 జూలై 1వ తేదీన కర్నూలుకు జిల్లా హోదా వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 166 సంవత్సరాలపాటు కర్నూలు జిల్లా కేంద్రంగా ఉందన్నారు. ఈక్రమంలో ప్రతి సంవత్సరం జూలై 1వ తేదీన జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సోమవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

ఇంటి ముందు ఉన్న లారీ మాయం

ఇంటి ముందు ఉన్న అశోక్ లైలాండ్ లారీ మాయమయ్యింది. చింతలముని నగర్‌లో నరసింహులు అనే వ్యక్తి రోజు మాదిరే తన ఇంటి ముందు లారీని పార్కింగ్ చేశారు. అయితే ఉదయం లేచి చూసే సరిగా అది కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆయన నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.